# స్వరాజ్య చతుర్దశి

— శ్రీ కపిలకాశీపతి —

"కామధేనువుకీ, కల్పవృక్షానికీ, అక్షయపాత్రకీ, అన్నపూర్ణమ్మకీ ఆశ్రయమైన ఈ కర్మ భూమిలో, ఈనాడు ప్రజ 'అన్నమో రామచంద్రా! అలో లక్ష్మణా!' అని అల్లాడిపోతూంటే ఏమానవుడి గుండె నీరుకాదు? కడుపు చెరువు కాదు? మన దేశాన్ని ఈ దౌర్భాగ్యస్థితికి తీసుకురావడానికి బాధ్యులెవరు? జవాబు ప్రతిధ్వనిస్తోంది. భూనభోంతరాళాలలో మారుమ్రోగుతోంది. బ్రిటిష్‌వారు-బ్రిటిష్‌వారు-బ్రిటిష్‌వారు."

సభలో—"నీబట్టతలకి కారకు లెవరు?"

"బ్రిటిష్‌వారు-బ్రిటిష్‌వారు-బ్రిటిష్‌వారు."

అధ్యక్షుడు—అందర్ ఖామోష్.

సభలో—"ఇది పాకిస్థానం కాదయ్యా."

—అది మహాసభ. భారతస్వాతంత్ర్య మహోత్సవాలు ఏవిధంగా నడపాలో నిర్ణయించడానికి సమకూడిన దేశభక్తుల మహాకూటం.

మహావక్త మాట్లాడుతున్నాడు:—

"మహాజనులారా! ఈ సందర్భంలో భారత ప్రజ ఏమి చెయ్యవలసివుంది? తరతరాలనాటి మన వారసులకి ఈ దినం జ్ఞాపకం ఉండడానికి, చిరస్థాయిగా యీ విషయం ప్రజాహృదయంలో నాటుకోవడానికి మనం చేయవలసిన పని ఏమిటి? కర్తవ్యం ఏమిటి? ఆనాడు యావద్భారత ప్రజా తిరిగి బద్ధకంకణులు కావాలి. దేశంలో క్షామం, కరువు, కాటకం లేకుండా చేయాలి. ఎనిమిది ఔన్సుల రేషను అనే మాట గవర్నమెంటు పుస్తకాల్లోంచి తీసిపారెయ్యాలి. ఇది చేయాలి అంటే రాజకీయపరిస్థితులలో మార్పు అవసరం. ప్రభుత్వం అనేది ప్రజ్ఞావంతుల చేతిలో వుండాలి. ప్రజానాయకుల చేతిలో వుండాలి."

అధ్యక్షుడు—"తమరు అనవసర విషయాలు ప్రసంగిస్తున్నారు. ప్రస్తుతం చర్చనీయాంశం అందరూ కలిసి స్వాతంత్ర్యోత్సవ విధానం నిర్ణయించడం.

సభలో—"మాట్లాడండి. ఆయనతో మీకేంటి?"

మహావక్త ఉపన్యసిస్తున్నాడు—"మహాజనులారా, అధ్యక్షులవారు నా వాగ్ధాటి అరికట్టడానికి ప్రయత్నిస్తున్నారు. స్వాతంత్ర్యోత్సవం ఏ విధంగా చేయాలో నిర్ణయించటానికి ముందు స్వాతంత్ర్యం అంటే ఏమిటో తెలుసుకోవలసివుంది."

సభలో—అది తెలియకేనండీ ఈ గొడవంతాను.

మహావక్త—స్వాతంత్ర్యం అంటే ఈదేశంలో జన్మించిన ప్రతివ్యక్తికీ మత, కుల, జాతి, లింగవిచక్షతలు లేకుండా తినడానికి తిండి, కట్టడానికి బట్ట, వుండడానికి ఇల్లు ఏర్పాటుకావాలి. ఇటువంటి ఏర్పాట్లు

చేయడానికిగాను పోయిన మంత్రివర్గంవారు ఒక బ్రహ్మాండమైన ప్రణాళిక తయారుచేశారు.

అధ్యక్షుడు—తమరు మళ్ళీ అప్రస్తుతంలోకి వస్తున్నారు.

వక్త—మహాజనులారా! నమస్కారం. మాట మాటకి అడ్డొస్తుంటే నా హృదయంలో వున్న ఆవేదన మీకు చెప్పడం దుర్లభం. ఈ అధ్యక్షులవారి నిష్పాక్షికదృష్టిలో నాకు నమ్మకంలేదు. నేను ప్రొటెస్టుచేసి నా ఉపన్యాసం ఇంతటితో ముగిస్తున్నాను.

సభలో—ఇంక్విలాబ్ జిందాబాద్! జైహింద్!

అధ్యక్షుడు—స్నేహితులారా! కాలవ్యవధి చాలా తక్కువగా వుంది. కార్యక్రమం చాలా వుంది. మాట్లాడవలసినవారు చాలామంది వున్నారు. ఇక తక్కినవారందరూ ఐదు నిమిషాలు మించకుండా, విషయం సంగ్రహంగా చెప్పి ముగించవలసిందని నా ప్రార్థన. తరువాతివారు.

ఉప—అయ్యా, యాభై సంవత్సరాలుగా భారతజాతీయమహాసభ అధ్వర్యంక్రింద దాదాభాయి నౌరోజీ, బాలగంగాధరతిలక్, మహాత్మాగాంధి మొదలయిన మహానాయకుల సారథ్యంక్రింద నడచిన భారత స్వాతంత్ర్యసమరచరిత్ర ఐదు నిమిషాలలో అవలీలగా చెప్పమంటే అది అసాధ్యమైన పని. నాకు పూర్వం ఉపన్యసించినవారు మహామేధావులు, వక్తలు, విశేషించి—దేశంకోసం త్యాగంచేసిన మహాపురుషులలో ఒకరు. అటువంటి మహనీయులకి ఈనాడు ప్రభుత్వంలో-మన కాంగ్రెసు ప్రభుత్వంలో పలుకుబడి లేదంటే శోచనీయమైన విషయమని మీరందరూ అంగీకరిస్తారు. అధికారవాంఛాధురంధరులైన, స్వార్థపరులైన కట్టుబడిదారుల కీలుబొమ్మలాటలో అస్మదాదులకు ఆశ్రయం లేకపోవడం మంచిదేనంటాను.

అధ్యక్షుడు—మీ టైమ్ అయిపోతోంది.

ఉప—నామీదకూడా ౧౪౪ సెక్షన్ ప్రయోగించారు. నేను చెప్పదలచుకొన్నది ఒకటే విషయం మన దేశం బాగుపడాలంటే ప్రాజక్టు లవసరం. రామపాదసాగరం, తుంగభద్ర, సంగమేశ్వరం, ముచికుంద మొదలైన ప్రాజక్టులు పైకితీసుకొచ్చి ప్రజాబలమున్న ప్రభుత్వం అందరికీ క్షేమం చేయాలి. పూర్వమంత్రివర్గంవారు పెట్టిన ఈ ప్రాజక్టులన్నీ—

సభలో—ఎడ్వైజరీ ప్రభుత్వంవారు పెట్టినారండి.

ఉప—ఎవరైతేనేం, అవి అమలుజరపటం ముఖ్యం. ఆ పని ప్రస్తుత ప్రభుత్వంవారు చేయవలసి వుంది. వారు చెయ్యకపోతే వారికి వత్తిడి కలిగించవలసిన విధి ప్రజలమీద వుంది.

అధ్య—తరువాతి వారు.

ఉపన్యాసకుడు—భాయియో, భాయినో!

సభలో—ఇది ఉత్తరహిందూస్థానం కాదురా?

ఉప—స్వాతంత్ర్యభారతానికి రాష్ట్రభాష అయిన యీ హిందీమీద ఆంధ్రులకి యింత ద్వేషం ఎందుకో నాకు బోధపడడంలేదు. యావద్భారతదేశంలోనూ ఎక్కువమంది ప్రజలు మాట్లాడే భాష హిందీ.

సభలో—"కాదు, హిందూస్తానీ."

"హిందూస్తానీభాష అనేది లేదు."

"పాకిస్థానం పోయింతరువాత హిందూస్థానీ ఎందుకురా?"

ఉప—మహాజనులారా! యీ సంకుచితదృష్టివల్ల దక్షిణదేశానికి నష్టమేగాని లాభం లేదు. ప్రపంచమంతా ఒక్కభాషక్రింద తీసుకురావాలని ప్రయత్నాలు జరిగేటప్పుడు భారతదేశంలో యిన్నిభాషలు ఉండడం విచారకరమైన విషయం.

సభలో—ఆ ప్రపంచభాషే భారతదేశానికి పెట్టరాదూ?

"అదే ఇంగ్లీషు"

ఉప—ఆంగ్లమానసపుత్రులైన మీకు నేను చెప్పగలిగింది లేదు.

సభలో—నువ్వు హిందూస్థానీమానసపుత్రుడివా?

ఉప—ఈ అభిప్రాయభేదాలవల్లనే, మనలో మనకు కొట్లాటమూలంగానే, ఇంతవరకూ పట్టాభి

రాష్ట్రపతి కాలేదు. ఆంధ్రకేసరిమంత్రిత్వం పోయింది. చెన్నపట్టణంకోటమీద తెనుగుజండా పడిపోయింది.

సభలో—"తెనుగుజండామీద అంత మోజు ఉంటే నీకు హిందూస్థానీ ఎందుకయ్యా?"

"పోతేపోయిందిలే. కొత్తజండా వచ్చిందిగా, గాంధీగారి రాటంతీసేసి, బుద్ధదేవుడి చక్రం పెట్టి."

ఉప—హతోస్మి. హతోస్మి! పాపము శమించునుగాక. భారతప్రజాపరిషత్తులో అంగీకరించబడిన, ఆమోదించబడిన భారతీయధ్వజంమీద యింత నిరాదరణ పనికిరాదు. నాకు కాలం సమీపించింది. నేను చెప్పేది ఒకటే విషయం. భారతదేశం బహుభాషా సమస్య. పరిష్కారం అయిననాడుతప్ప మనకు స్వాతంత్ర్యం వచ్చినా లాభంలేదు. ఆ ఏకభాషాసంస్థాపనకోసమే స్వాతంత్ర్యోత్సవదినంనాడు మన జీవితాలు మళ్లీ మనం పునరంకితం చెయ్యాలి.

అధ్య—తరువాతివారు.

ఉప—ఇప్పుడు, యింతక్రితం ప్రసంగించినవారు భాషవిషయమై ప్రస్తావించారు. మనకు సంపూర్ణ స్వరాజ్యం సార్థకం కావాలీ అంటే మన సంస్కృతిని పునరుద్ధరించుకోవాలి. భాషగానీ మరిఏదిగానీ విజ్ఞానాన్ని అనుసరించే ఉంటాయి. భారతీయ విజ్ఞానం యీనాడు అడుగంటిపోయిన దేవభాష—సంస్కృత భాషలో, నివురుగప్పిన నిప్పులాగా యిమిడివుంది. ఆ సంస్కృతభాష తిరిగి రాజాదరణం పొందిననాడే భారతదేశానికి ముక్తి, భుక్తి. సంస్కృతభాషతోపాటు వేదమతం పునరుద్ధరించవలసిన అవసరం వుంది. ప్రపంచస్వాతంత్ర్యచరిత్రలో మహాత్మా మోహన్దాస్ కరమ్చంద్ గాంధీ ఒక నూతనఅధ్యాయం రచించారు. ఈ రామాయణంలో అది అహింసాకాండ. భౌతికాంధకారంలో పడి కొట్టుకుంటున్న ఈ పామరప్రపంచానికి ఆధ్యాత్మికదృష్టి ప్రసాదించిన మహానుభావుడు మహాత్ముడు. అవతారపురుషుడు. ఈ ఆధ్యాత్మికదృష్టే భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మ. పాశ్చాత్యులు పంచేంద్రియాలకు స్పష్టమయే పాంచభౌతికప్రపంచం స్థూలంగా పరిశీలించి ఆటంబాంబు సృష్టించి మానవనిర్మూలనతంత్రంలో ఒక నూతనఅధ్యాయం కల్పించారు. అదే యీనాడు సర్వప్రభుత్వాల్నీ బాధిస్తున్న సమస్య. ఈ శక్తినే మన పూర్వులు సూక్ష్మంగా సాధించారు. దానికి మార్గం యోగాభ్యాసం. ఈనాడు పాశ్చాత్యులు భౌతికంగా సాధించిన రేడియో, టెలివిషన్, ఆటంశక్తి మొదలయినవన్నీ మన పూర్వులు సూక్ష్మంగా సాధించారు. వీటినే దూరశ్రవణం, దూరదృష్టి అన్నారు. శివుడు మూడోకన్ను తెరిచాడూ అంటే ఏమిటి? తనలో వున్న ఆటంశక్తి ప్రయోగించాడన్నమాట. ఇదేవిధంగా మానవసౌభాగ్యంకోసం మనవారు సృష్టించిన శాస్త్రాలు, కళలు, విద్యలు అనేకం వున్నాయి. ఒక్క ఆయుర్వేదం తీసుకోండి మచ్చుకి. కొన్నికోట్లు ఖర్చుపెట్టి పరిశోధన చేసి నిర్మించిన అల్లోపతీకి యీనాటికీకూడా అందని, అందరాని సూక్ష్మవిషయాలు ఆయుర్వేదం గ్రహించింది ఏనాడో. మన అథర్వణవేదంలో పాశ్చాత్యులు యీనాడు కనిపెట్టిన మారణయంత్రాలు అన్నీ వున్నాయి. రష్యావారు అథర్వణవేదంమీద పరిశోధన చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇతరజాతులకి ఆకర్షణీయమైన మన పూర్వవిజ్ఞానం మన దేశంలో అడుగంటిపోవడం చాలా శోచనీయం. భారత స్వాతంత్ర్య ప్రభుత్వం భారతజాతీయవిజ్ఞాన పునరుద్ధరణ కార్యక్రమం వెంటనే ప్రారంభించి దేశాన్ని బాగుచేస్తే తప్ప.........

సభలో—బ్రాహ్మలకి మళ్లీ ప్రభుత్వం రాదు.

అధ్య—తరువాతి వారు.

ఉప—సోదర సోదరీమణులారా! సోమయాజులవారు భారతీయ విజ్ఞానవిషయమై ప్రసంగించారు. జాతీయత అనేది ప్రతివిషయంలోనూ ఉండాలి. యజ్ఞోపవీతం తెంపిపారేసి, పిలక కత్తిరించి, నోట్లో సిగరెట్టుతో, చేతులో కాఫీకప్పుతో నేను వేదపారాయణం చేస్తానంటే మీరంతా నవ్వుతారు. అదే విధంగా కేవలం మాంచెస్టరునుంచి ఈమధ్యనే దిగుమతిఅయిన తెల్లని మల్లుపంచే చీకటిబజారులో సేకరించి ధరించిన శ్రీ సోమయాజులవారు జాతీయ సంస్కృతివిషయమై ప్రసంగించడంకొంచెం హాస్యాస్ప

దంగా ఉంటుందంటే అతిశయోక్తి గాదు. జాతీయ సంస్కృతి కావలసినవారు జాతీయవస్త్రంగూడా ధరించాలి. అదేమి ఖర్మమో మన సనాతనులందరికీ కాస్మాపోలిటన్ క్లబ్బుమీద, గ్లాస్గోమల్లుమీద, ఫ్రెంచి సెంట్లమీద వ్యామోహం. స్వరాజ్యం సంపూర్ణం కావాలంటే జాతీయత సంపూర్ణం కావాలి. మన జాతీయపరిశ్రమలు వృద్ధిచేసుకోవాలి. దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో, తాలూకాలో, ఫిర్కాలో, గ్రామంలో స్వయంసంపూర్ణత్వం, స్వయంపోషకత్వం రావాలి. వ్యవసాయంతరువాత భారతప్రజానీకానికి ముఖ్యాధారమైన వస్త్రపరిశ్రమ—మనదేశానికి రెండో ఊపిరితిత్తి అన్నాడు గాంధీగారు ఖాదీపరిశ్రమ—అది వృద్ధికావాలి. మిల్లువస్త్రంమీద ఆధారపడితే మిల్లులకోసం విదేశాలమీద ఆధారపడాలి. వాటికోసం విదేశాలనుంచి నిపుణులు రావాలి. ఇవన్నీ లేకుండా మన దేశసౌభాగ్యానికి ధనికతత్వం రాకుండా, ప్రజానీకం మేలుకోసం మహాత్మాగాంధీగారు పెట్టిన నిర్మాణకార్యక్రమం సవ్యంగా నడిపితే తప్ప మనకి మోక్షం లేదు, లేదు, లేదు; ముమ్మాటికీ లేదు.

అధ్య—తరువాతి వారు.

ఉప—ఆర్యులారా! ఈనాడు, మన దేశంలో ప్రతినాయకుడి నోట్లోను—వినాయకుల నోట్లోగూడా—రెండే మాటలు వింటాం: మహాత్మాగాంధీ, ప్రజానీకం. మహాత్మాగాంధీగారు చెప్పిన ప్రతివిషయం అక్షరాలా అనుసరించిన స్త్రీగాని, పురుషుడుగాని సప్తసముద్రాలు దాటి కంచుకాగడాలు పెట్టి వెతికినా ఎక్కడా లేరని ఘంటాపథంగా చెప్పగలను. మూలవిరాట్‌లాగా ఏ భంగీకాలనీలోనో ఆ ముసలాయన్ని ప్రతిష్ఠజేసి పదిమాట్లు దర్శనంచేయుడంతప్ప ఆయనమాట విన్నమని పొక్కడున్నాడా? పోనీ, ప్రజానీకం అన్నారు. ఈ ప్రజానీకంకోసం యీనాడు ఏమయినా సవ్యంగా సజావుగా చేస్తున్న పెద్దమనుషులున్నారా? లేరు. ముమ్మాటికీ లేరు. ఇది మనదేశ చరిత్రలో ఒక మహాముహూర్తం. కాంగ్రెసు అనండి, అజాదుహిందు అనండి, ఆగష్టువిప్లవం అనండి, రష్యా అనండి, అమెరికాఅనండి, ఏకారణాలవల్లనో—అవి మనకు తెలియవు—బ్రిటిషువాడు మనకు ఏదో యిచ్చి వెళ్లిపోతున్నాడు. ఇరుగు పొరుగుల్లో యిరుక్కునివుంటాడో, నిజంగా వెడతాడో పరమేశ్వరుడికెరుక. చచ్చినవాడి పెళ్లికి వొచ్చిందే కూడని యీ సమయంలో మనం మన దేశాన్ని బలపరచుకోవాలి. దీనికి మార్గం తకిలీగాదు, ఆటంశక్తి. పదిసంవత్సరాలలో, మనకంటే పెద్దదేశమయిన, మనకంటే అధోగతిలో వున్న, మనకంటే భాషాబాహుళ్యం వున్న, మనకంటే ఎక్కువ జాతిమతభేదాలు వున్న రష్యా దేశం నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వుంది. రష్యా పేరు చెప్పానని నన్ను మీరు కమ్యూనిష్టు అనుకోవద్దు. జరగవలసినవిషయం ఏమిటంటే మన దేశసంపద మనం అనుభవించే అర్హత, సామర్థ్యం సంపాదించుకోవాలి. దీనికి మార్గం విజ్ఞానం; తన్మూలంగా సాధించగలిగిన విద్యుచ్ఛక్తి. ఆ విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేయడానికి మన దేశంలో సప్తసాగరాలవంటి సప్తనదులున్నాయి. విద్యుచ్ఛక్తితో పాతాళగంగ పైకొస్తుంది. ఆకాశగంగ కిందికి దిగుతుంది. దానివల్ల జరగని పని లేదు. ప్రజలు, ప్రభుత్వం ఏకమయి యీ శక్తినిర్మాణం చేసిననాడే మనకు పుట్టగతులుంటాయి. లేకపోతే గుండుసూదిమీద గుండుకూడా తయారుచెయ్యలేని యీ దౌర్భాగ్యదేశం తుమ్మముళ్లతోటీ, దర్భపుడకలతోటీ కాలక్షేపం చెయ్యవలసిందే.

అధ్య—తరువాతివారు.

ఉప—యింతమటుకు యెంతమందో యెన్నో విషయాలు చెప్పారు. ఒక్కరయినా నిమ్మజాతులు సంగతి ప్రసంగించలేదు. మన దేశములో కొన్నికోట్ల మంది అంటరానివారున్నారు. యీ అంటరానితనం నిర్మూలం చేస్తేతప్ప యీ దేశం యింతే నంటాను. నిమ్మజాతులుకి అన్నిహక్కులూ యివ్వాల. బంజరు భూములన్నీ ఆళ్లకే రాయాల. యిదంతా యెందుకూ? భారతదేశానికి మొదటి అధ్యక్షుడు హరిజనుడే కావాల.

సభలో—"హరిజనుల్లో తెగలు లేవా?"

"మాలమాదిగలు పరస్పర వివాహాలు చేసుకుంటారా ?"

ఉప—యిన్ని వేల సంవత్సరాలుగా మీరు మమ్మల్ని తొక్కిపారేసి ఊరుబయట అణగ్గొట్టి సదువు లేకుండా, ఆస్తిలేకుండా పాడుజేసి, యీనాడు పరస్పరయివాహా లంటావా ? నీకు మల్లే చదువొచ్చి, నీకు మల్లే డబ్బుండి, నలుగుర్లో తిరిగేటప్పుడు, మాలా లేదు మాదిగా లేదు. బ్రామ్మలు, ఛత్రియులు, కోమట్లు, శూద్రులు అనే కులాలు పోయినప్పుడు మా కులాలు కూడా పోతయి.

సభలో—తథాస్తు!

అధ్య—తరువాతివారు.

ఉప—జైహింద్! కామ్రేడ్స్! యీనాడు భారతదేశానికి నిజంగా సుదినమో దుర్దినమో నేను చెప్పలేకుండా వున్నాను. కష్టపడి సాధించింది ఒకరు, అనుభవించేది ఒకరు. దేశం విడిచిపెట్టి పరాయిప్రభుత్వాల ప్రాపు సంపాదించి అజాద్‌హింద్‌ఫౌజు నిర్మించి మన శత్రువులమీద దండయాత్ర సాగించి వాళ్ల గుండెల్లో గాలం వేసిన మహానుభావుడు, ద్వితీయ భారత స్వాతంత్ర్యసమరనేత, నేతాజీ సుబాస్ చంద్రబోస్ !

సభలో—"జైహింద్, నేతాజీ బోస్‌కీ జై !"

అధ్య—నిశ్శబ్దం, నిశ్శబ్దం. యీ స్వాతంత్ర్యం ఎవరు ఎల్లా సాధించారు అనే చరిత్రవిషయం యిప్పుడు చర్చనీయం కాదు. యికముందు వచ్చే ఉపన్యాసకులకు రెండునిముషాలకంటే ఎక్కువ యివ్వటానికి వీలు లేదు. తరువాతివారు మహిళా సంఘాధ్యక్షురాలు శ్రీమతి శిరీషకుసుమంగారు.

శిరీషం—అధ్యక్షా, సోదరసోదరీమణులారా! పురుషనిర్మాణమైన యీ చట్రంలో యింతవరకు పురుషులే ఎక్కువగా మాట్లాడివుండడం అంత ఆశ్చర్యకరమైన విషయం కాదు. అయినప్పటికీ నాకు మాట్లాడడానికి అవకాశం యిచ్చినందుకు మీకూ మీ అధ్యక్షులవారికీ నా అభివందనాలు. నేను ఒక్క విషయం మాత్రం మనవిచేస్తాను. అదేమిటీ అంటే, యీ స్వాతంత్ర్యసాధనలో వీరమాతలు, వీరపత్నులు, వీరనారులు ఎంతమందో తమ సర్వస్వం ధారపోసిన సంగతి మీకు తెలియని విషయం కాదు. వెనకటి సోమహాకవి వ్రాశాడు. పురుషుడైనా ధన్యాత్ముడు— "ఘనపతివ్రతాశాప కారణమున భానునుదయంబు వారింపబడియెగాన భారతీయాభ్యుదయమందు పాలుగొనగ ఆడువారికి మీయంత హక్కు గలదు." తత్కారణంగా స్వతంత్రభారతంలో నిర్మాణం కాబోయే నాగరికతాభవనాలలో అంతఃపురాలు తీసేసి, స్త్రీకి పురుషులతో సమానహక్కు లిచ్చి, విడాకుల చట్టం పెట్టి దేవదాసీపద్ధతి నిర్మూలంజేసి, సృష్టికారకురాలైన స్త్రీమూర్తి శక్తి గ్రహించి ఆరాధించిననాడే పురుషుడికి పుణ్యం పురుషార్థం లభిస్తాయని మనవిజేసి విరమిస్తున్నాను.

అధ్య—తరువాతివారు జాతీయముస్లిం నాయకులు అబ్దుల్ ఖాదర్‌సాహెబు బహదూర్‌వారు.

అబ్దుల్ ఖాదర్—స్నేహితులారా, నేను మొదణ్నించీకూడా పుట్టిన దేశంలో వుండి, ఏమతలవారైనాసరే అన్యోన్యంగా వుండాలని చెప్పేవారిలో ఒకణ్ని. అబ్దుల్‌ఖాదర్ అంటే సంస్కృతంలో భగవద్దాసు అని అర్థం. ఏకోనారాయణం అనే ఉత్కృష్టమైన వేదాంతమతానికీ, ఒకడే దేవుడనే మహమ్మదీయమతానికీ ఏవిధమైన వ్యత్యాసమూ లేదు. ఈనాడు కారణాంతరాలవల్ల రెండు భాగాలైన యీ అఖండహిందూస్థానము మళ్లీ ఏకీభవిస్తుందని నా విశ్వాసం. జాతీయముస్లిముల తరఫున నేను నూతనభారతీయ జాతీయపతాకానికి జోహారు లర్పిస్తున్నాను

అధ్య—తరువాతవారు క్రైస్తవ సంఘ కార్యదర్శి నెల్లిమర్ల చినజానుగారు.

చినజాను—భారతీయ క్రైస్తవులు ఎప్పుడూ జాతీయవాదులే. కాని ఒక్క విషయం. అల్పసంఖ్యాకులైన కులాలన్నిటికీ స్వతంత్రభారతదేశంలో అన్నివిధాలైన అనుకూలాలూ కలగజేసి వారి హక్కులు కాపాడతారని నా విశ్వాసం. రేపు జరగబోయే స్వాతంత్ర్య ఉత్సవాలలో మా సంఘంవారు పాల్గొన

డానికి సంసిద్ధులు. మా చర్చిలలో యీ సందర్భంలో ప్రార్థనలు జరపటానికి ఏర్పాట్లుచేశాం. తక్కిన కార్యక్రమం పెద్దలంతా ఏవిధంగా నిర్ణయిస్తే ఆవిధంగా మేం అనుసరిస్తాం.

అధ్య—తరువాతివారు.

ఉప—మహాజనులారా! సర్వజిత్తునామ సంవత్సర అధికశ్రావణ బహుళ చతుర్దశి శుక్రవారం భారతదేశానికి మహాసుదినం. ఇన్నాళ్లుగా మనం ఉవ్విళ్లూరి, ఆపిల్ల బాలాది ఎంతో త్యాగంజేసిన స్వాతంత్ర్యం అనే మహాధనం మనకు ఆనాడు పూర్తిగా లభిస్తుంది. ఆ మహాపర్వదినంనాడు మన సంతోషం ప్రకటించడానికీ, ప్రజానీకానికి స్వాతంత్ర్య సందేశమర్మం తెలియజెయ్యడానికీ ఏవిధంగా కార్యక్రమం నిర్ణయించాలి అనే విషయం చర్చించడానికిగాను ఈ సమావేశం ఆహ్వానించడమైంది. కాంగ్రెసు హైకమాండువారు దీనికిగాను కొన్ని నియమాలు చేశారు. రాష్ట్రీయ ప్రభుత్వంవారుకూడా యీ విషయం ఆలోచించి కొన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో ముఖ్యమైన విషయం భారతస్వాతంత్ర్య ధ్వజారోహణం. పెద్దలంతా ఆలోచించి మనం యావన్మందీ యిన్నాళ్లుగా ఏపతాకంక్రింద ప్రజాసమరం సాగించామో, ఆ జాతీయ పతాకంలోనే కొద్దిగా మార్పుజేసి, దాన్నే స్వతంత్రభారతధ్వజంగా నిశ్చయించారు. రాట్నచిహ్నం తీసేసి బౌద్ధధర్మచక్రం జండామీది కెక్కించారు. అవతారపురుషులలో అగ్రగణ్యుడైన గౌతమబుద్ధుడు లోకానికి ప్రసాదించిన అహింసాధర్మం, మానవసేవ, త్యాగదీక్ష మూర్తీభవించి మూడు వేళలా మనకు ఆ మహదాశయాలు గుర్తింపజేసే కాలచక్రమే ఆ మహాచక్రం. ఆ చక్రంలోనూ, ఆ చక్రం ఎక్కిన జండాలోనూ మన జాతిగౌరవం, మన జాతిప్రభావం, మన జాతి భవిష్యత్తు మూర్తీభవించి వున్నాయి. ఈ జండా స్వాతంత్ర్యరథానికి కట్టి "మాధవా మన రథంబు మరల్పరాదు" అన్నట్టుగా నిరోధం లేకుండా భావిభారత అభ్యుదయయాత్ర సాగిపోవాలి. ఏనాడో పురాణయుగంలో ఒకానొక చతుర్దశినాడు లోకకంటకుడైన నరకాసురుణ్ని సత్యభామసహాయంతో నిర్మూలం చేశాడు శ్రీకృష్ణమూర్తి. ఆనాటి సంస్కృతి మా సోదరి శిరీషం చెప్పినట్టు కేవలం పురుషనిర్మాణమే కాదు. స్త్రీ పురుష సహకారానికి చిహ్నంగా అర్ధనారీశ్వరమూర్తిని సృష్టించిన యీ భారతీయ నాగరికతలో హెచ్చుతగ్గులు భావించేవారికిగాని కనపడవు. రేపు శుక్రవారంనాడు మళ్ళీ చతుర్దశి. నరకచతుర్దశి తరువాత మళ్లీ స్వరాజ్యచతుర్దశి. దీపావళిపండుగ చేసినట్టుగా యీ మహాపర్వదినంకూడా భారతదేశంలో తరతరాలుగా నిలిచిపోతుంది. నరకచతుర్దశి ఒక్క హిందువులకు మాత్రమేకాని యీ స్వరాజ్యచతుర్దశి సర్వమతాలవారికీ సంబంధించింది. జాతిమతవిభేదాలు లేకుండా, స్త్రీ పురుష భేదాలు లేకుండా, కులభేదాలు పాటించకుండా, ఆసేతుహిమాచలపర్యంతం, ఆబాలగోపాలం, స్వరాజ్యచతుర్దశి మహాపర్వదినంగా చెయ్యాలి. ఇంటింటా ఆనాడు దీపావళిచేసి, స్వరాజ్యలక్ష్మిని ఆరాధించి, శుక్రవారం నోములు చెయ్యవలసిన పర్వదినం. శ్రావణ శుక్రవారంనాడు మహాలక్ష్మిలాగ చల్లని చూపులతో ఘల్లు ఘల్లని వచ్చిన స్వరాజ్యలక్ష్మిని ఆ రోజున గ్రామగ్రామంలోనూ, వాడవాడలలోనూ, గుమ్మంగుమ్మంలోనూ ప్రతిష్ఠాపన జేసి, ఆరాధించవలసిన సుదినం. మన నాయకులూ, కేంద్ర, రాష్ట్రీయ ప్రభుత్వాధికారులూ నిర్ణయించిన కార్యక్రమం అక్షరాలా జరిపి, యితోధికంగా ఎవరి శక్త్యనుసారం వారు స్వరాజ్యలక్ష్మివ్రతం జేసి ధన్యాత్ములు కావాలని నా ప్రార్థన.

అధ్య—కాలాతీతమైంది. అందుచేత యింకా మాట్లాడదలచుకున్నవారికి అవకాశం యివ్వలేకపోయినందుకు నేను విచారిస్తున్నాను. నాకు తోచిన విషయాలు ఏవో రెండు చెప్పి అంతటితో సభ ముగింపు చేస్తాను. యీ రోజున యీ సభకు అధ్యక్షత వహించడంవల్ల నేను నేర్చుకున్నది, మీకు చెప్పవలసింది ఒక్క విషయం వుంది. అది ఏమిటీ అంటే మన జాతి అనవసర ప్రసంగం మానెయ్యవలసిన అవసరం. పిడికిటికీ బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్టు ఏ సభలోకి

వచ్చినా, ఏ వేదిక ఎక్కినా, "గుడ్డెద్దు చేలోపడ్డట్టు" ఒకే ధోరణిలో ౧౯౪౭ సంవత్సరంలో ఏ ఉపన్యాసం చేశామో, ఏ అంశాలు మాట్లాడామో అవే చర్వితచర్వణంగా చెప్పడం మన జాతీయనాయకులకు పరిపాటి అయిపోయింది. యీ రోజున యిక్కడ మాట్లాడినవారందరిలో ఒకరిద్దరు మినహా అసలు విషయంమీద ఎవరూ ప్రసంగించలేదు. మాట్లాడవలసిన విషయ మేదో గ్రహించి, చెప్పదలుచుకున్నది ఏదైనా ఉంటే అది క్లుప్తంగా చెప్పి వెళ్లిపోవడం నాగరికులైన జాతి మనుష్యుల లక్షణం. ఆ లక్షణం నేర్చుకున్నప్పుడే స్వరాజ్యం సార్థకం అవుతుంది. యింతక్రితం మాట్లాడినవారి సలహాలన్నీ మనం యావన్మందీ ఆమోదించవచ్చునని నా అభిప్రాయం. ప్రజానీకానికి యీ స్వాతంత్ర్యసందేశం అందజేయాలీ అంటే స్వరాజ్య చతుర్దశినాడు సర్వమతాలవారూ స్వరాజ్య లక్ష్మిని ఏదోవిధంగా ఆరాధించాలి. తరువాత భారత జాతీయ గౌరవచిహ్నమైన చక్రధ్వజం ఊరూరా ప్రతిష్ఠాపనజేసి, జాతీయగీతాలు పాడి, పర్వదినంగా చెయ్యాలి. ఇందుకుగాను ప్రభుత్వంవారు మన రాష్ట్రంలో వున్న ప్రతిగ్రామానికీకూడా ఒక చక్రపతాకం అందజెయ్యాలి. మన రాష్ట్రంలో వున్నవి మొత్తం ౩౭౦౦౦ గ్రామాలు. ఏ జిల్లాలో ఆ జిల్లా కలెక్టర్లు పతాకాలు తయారుచేయించి తహసీల్దార్లగుండా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లగుండా, మునసబుల ద్వారా గ్రామాలకు చక్రపతాకాలు సరఫరాచేసి, ధ్వజారోహణ మహోత్సవం జరిపించాలి. దీనికి కాలవ్యవధి లేదు అని ప్రభుత్వంవారు అనడానికి వీలులేదు. తలుచుకుంటే యిది రెండుమూడురోజుల్లో జరిగే పని. స్వాతంత్ర్యోత్సవాలు కేవలం పట్టణాల్లో జరిగి లాభం లేదు. గ్రామాలకు స్వాతంత్ర్యసందేశం అందాలి అంటే చక్రపతాకం ప్రతిగ్రామంలోనూ ప్రతిష్ఠ చెయ్యాలి. ఈ అంశాలు విపులంగా చర్చించి ఏర్పాట్లు చెయ్యడానికిగాను ప్రభుత్వంవారు వెంటనే ఒక చిన్నకమిటీ పెట్టి దానికి కావలసిన సొమ్ము మంజూరుజేసి స్వాతంత్ర్యోత్సవాలు జరిపించాలి అని సభవారి తరఫున నేను ఒక తీర్మానం ప్రతిపాదిస్తున్నాను. ఇది అందరూ ఆమోదిస్తారని అనుకుంటాను.

సభలో—అందరూ, అందరూ.

